# వామనుడే!

-పి.వి.బి.శ్రీరామమూర్తి

ఆరడుగుల మూడంగుళాల వానమరావును అందరూ పేరుకు తగ్గట్టివాడే నంటారు వెక్కిరింపుగా.

"ఎక్కడికి వెళ్లిపోయారు? హడిలి చచ్చాం" తేనెటీగలు దాడి చేసినట్లుగా ఒంటికాలిమీద లేచారు నలభై అయిదురోజుల తరువాత ఇంట్లో అడుగుపెట్టిన వామనరావు మీద.

భుజాన తగిలించుకువున్న బేగ్‌ను సోఫామీద విసిరికొట్టాడు. కళ్లద్దాలు తీసి చెమట పట్టిన కళ్లను తుడుచుకున్నాడు. రోజున్నర రైలు ప్రయాణం చేసి వచ్చాడేమో బాగా అలసిపోయాడు. వయసు నలభై ఏడయినా గడ్డం పూర్తిగా పండిపోయి వారంరోజులుగా గీరకపోవడంచేత జబ్బు పడిన వాడిలా కనిపిస్తున్నాడు. చెమట పట్టిన చొక్కా విప్పి సోఫామీద పడేసాడు.

"మిమ్మల్నే వినిపించడంలేదా? చెప్పా పెట్టకుండా ఎక్కడికి పోయారు?" సాగదీస్తూ అడిగింది వెంకటరత్నం గయ్‌మని.

"ఏంటయ్యా... ఎనుబోతు మీద వాన కురిసినట్లు... అలా ఉలుకూ పలుకూ లేకుండా ఉండిపోయావు? ఏ గోదాట్లోనైనా కొట్టుకుపోయావేమోనని బెంగెట్టుకు తన్నుకున్నాం" అత్తగారు మహంకాళిలా చేతులు త్రిప్పుతూ నోరు పారేసుకుంటోంది.

"మీరు నోర్మూస్తారా? మెడమీద చెయ్యేసి వీధిలోకి గెంటెయ్యమంటారా?" పిల్లి కరవడానికి మీద పడినట్లయి అత్తగారు వెనక్కి అడుగేసింది.

"చేసింది వెధవ పని, అంత పౌరుషం తన్నుకొచ్చేసిందే? పైగా ఆ ఎటియం కార్డు పోయిందని కంప్లైంట్ ఇచ్చి బేంకులోంచి డబ్బులు తీయడానికి వీల్లేకుండా చేస్తారా? కార్డు దగ్గరుంటే పోయిందని రిపోర్టు ఇవ్వడంలో మీ ఉద్దేశ్యం ఏంటట? ఆ కిరాణావాడికేం చెప్పారు? వాడు అయ్యగారొచ్చి చెప్తేగానీ కిరాణా సామాన్లు ఇవ్వనన్నాడు. డబ్బులివ్వకపోతే పాలివ్వనని మానేసాడు పాలవాడు. ఆఫీసులో సెలవు కూడా పెట్టకుండా వెళ్లిపోయారంట. మాటామంతీ లేకుండా ముంగిలా ఆ మొహం మీరూ... ఏంటి? మీ ఉద్దేశ్యమేంటట అసలు?" మీదకొస్తున్న భార్య చెంప ఛెళ్లుమనిపించాడు వామనరావు.

'జడ్డీ, నంగిరి, జిడ్డుమొహం, దుంపమొహం...'లాంటి ఎన్ని నీచోపమానాలతో ఎన్నిసార్లు ఎవరున్నారూ అనైనా చూడకుండా ఎప్పుడూ తనదే పైచేయి అయి వెలిగిపోయిన వెంకట్రత్నం ఈ హఠాత్ పరిణామాన్ని ఊహించలేకపోయింది.

"అమ్మో...చచ్చిపోయాన్రా నాయనో... ఒరే కన్నా...చిన్నా...రక్షించండి. మీ నాన్నమీద ఏదో గాలి వాలింది" అని అరవగానే అత్త కాంతమ్మ పక్కనే వున్న చీపురుకట్ట తీసి "నేను దులుపుతానే వీడి దుమ్ము... ఒరేయ్ ఎవడ్రా నువ్వు? ఎక్కడ్నించి వచ్చి వాలావు వీడిమీద. ఈ నంగనాచి తుంగమొద్దు నీకు దొరికాడట్రా పీక్కుతింటానికి?" ఇందాక తిట్టినందుకు కోపం పొగలై సెగలై లోపల్నుంచి పొంగుకొస్తుంటే అల్లుడ్ని మునక్కాళ్లా నమిలి పిప్పి చేద్దామన్న కసితో మీదకి రాబోయింది. గదుల్లోంచి కన్నా, చిన్నా ఎరకోసం చేప గంతులేసుకొచ్చినట్లు వచ్చారు. అప్పుడే అంట్లు తోమి చీపురుతో ఇల్లు ఊడుద్దామనుకున్న గౌరి గుమ్మం దగ్గర నిల్చుంది. కన్న పూర్తిగా తల్లి సపోర్టు. చిన్న తండ్రికి ఇంట్లో సరైన విలువ లేకపోవడం గమనిస్తూ మనసులోనే కుమిలిపోతాడుగానీ అమ్మకీ, అమ్మమ్మకి ఎదురు చెప్పలేక తన పని తాను చేసుకుపోతాడు. అలాంటి ఆ ఇద్దరూ తల్లి కేక విని బయటకొచ్చి ఈ దృశ్యాన్ని చూసి బొమ్మల్లా నిల్చుండిపోయారు.

"చూస్తారేంటర్రా వాజమ్మల్లారా... మీ నాన్న మీ అమ్మని చంపేస్తున్నాడు. ఆ చేతులు విరిచి కట్టండి. వీడి పని నేను చూస్తా" అని చీర కొంగు బొడ్లో దోపుకుని చీపురుకట్టతో వీరవిహారం చేయబోయింది.

"ఒసేయ్ అత్తా... ఇవాళ్టితో నీకు నూకలు చెల్లిపోతాయి. ఈ వామనరావు పాత వామనరావు కాదు. ఇది కొత్త అవతారం. ఒరే పిల్లలూ... నాకే పీడా పిశాచం పట్టలేదు. ఈ ఇంటికి ఇదిగో ఈ దెయ్యం పీడిస్తోంది. ఈ దెయ్యం మీ అమ్మ మీద వాలింది. వీళ్ల పీచమణుస్తాను" అని బెల్టు తీసాడు.

హిరణ్యకశిపుని మీదకి దూకిన నరసింహావతారం దాల్చిన విష్ణుమూర్తిలా విరుచుకుపడుతున్న అల్లుని రూపం చూసి కూతురు వెనక్కి పారిపోయింది కాంతం.

"తప్పుకో.. లేకపోతే ఇద్దరికీ దరువులైపోతాయి" అంటున్న భర్తకి భయపడి కాళ్లల్లో సత్తువ సన్నగిల్లి చచ్చుబడుతుంటే-

"నన్ను పట్టుకుంటావేంటే వదులూ..." అని తల్లిని పక్కకి తోసేసింది.

గౌరీ లోపలకు వెళ్లి ఫ్రిజ్ డోర్ తీసి వాటర్ బాటిల్ తెచ్చి "అయ్యగారూ... ముందు నీళ్లు తాగండి. కాఫీ కలిపి తెస్తాను. కాసేపు కూకోండి. పీనుగులాటి ఆ ముసిల్దాయి నొగ్గేయండి" అంది.

"సిగ్గు తెచ్చుకోండి. పనిపిల్లకున్న ఇంగిత


జ్ఞానం లేని వెధవలు మీరు. మిమ్మల్ని నరికి పోగులు పెట్టినా పాపంలేదు'' అని బెల్టు పడేసి సీసానీళ్లు ఆపకుండా గడగడా తాగేసాడు.

ఇంత భీభత్స దృశ్యం జరగడంవల్ల సరిపోయిందిగానీ అదే మామూలు రోజుల్లో అయితే ఆ పనిపిల్లనీ, వామనరావునీ అనరాని మాటలని కళ్లల్లో కారం కొట్టేవారే ఆ తల్లీకూతుళ్లు.

ఆ ఇంట్లో వామనరావును చవటదద్దమ్మని చేసి ఆడిస్తారు తల్లీకూతుళ్లు. బజారుకెళ్లి కూరలు తేగానే ఆ కూరలు ఒంపి సంచీ దులిపి ''ఏంటయ్యా... ఇవేవరైనా అప్పనంగా ఇచ్చారా? రోడ్డుమీద పారేస్తే ఏరుకొచ్చావా? ఈ బెండ కాయ చూడు నీలానే ముదిరిపోయింది. ఈ వంకాయ చూడు నీ మొహంలాగే మాడి పోయి ఉంది. నా కూతురు ఎలా నెట్టుకొ స్తోందో?'' ఇలా అత్తగారు దెప్పి పొడుస్తుంటే-

''ఇప్పుడనేం లాభం? తక్కువ కట్నంకి దొరికాడు కదాని కొనేసి నా మెళ్లో ఉరితాడేయించారు. నేను కాబట్టి భరిస్తున్నాను. ఇంకొకరయితే ఎవడి తోనో లేచిపోవడమో, ఇంకేదో చేసేది. అతగాడికి ఆఫీసు పని తప్ప ఇంకే మొచ్చు? నంగిరి నాగరాజు'' నెత్తిమీద రెండు చేతులతో మెటికలు విరుచు కుంది.

''అమ్మా! మద్దిల దూరానని అనుకోకండిగానీ ఆ బాబుకేం తక్కువ? ఆరడుగుల మనిషి, ఉంగరాల జుట్టు, సూడసక్కని రూపం. ఏ మాటకామాటే సెప్పుకోవాల అదేదో అంతార్నే...కాకి ముక్కుకి దొండపండులాగా మీరే ఓ సాయి తక్కువ, ఆ బాబు బుజాలకాడికీ రారు. అయినా ఏలు జీతం తెచ్చి పోస్తూ నోరూ వోయినేని ఆ బాబునెందుకమ్మా ఆడిపోసుకుంతారూ? అయినా కూరల మార్కెట్‌కెల్లి చూడండి ఎవులి సంచిలైనా పుచ్చులేని వంకాయా, ముదరని బెండకాయా కనిపిత్తాదేమో''



వామనరావు గదిలోకి వెళ్లాక మెల్లగా అంది.

"ఒసేయ్... అట్టే మాటాడితే రేపట్నుంచీ పనిలోంచి పీకి పారేస్తాను జాగ్రర్తా..." అంది వెంకట్రత్నం కూరలు ఫ్రిజ్‌లో పెడుతూ.

"సూడండీ... ఈ తాటాకు కుందేల్లు జడవ్వు. కాయకష్టంతో బతికిందానికీ గడప కాపోతే ఇంకో గడప. అమ్మో... ఈ రోజుల్లో డబ్బెడితే బంగారం దొరుకుతుందిగానీ ఉన్న పనిపిల్ల నొగ్గుకుంటే మరో పనిపిల్ల దొరకదు" అని సవాలు విసిరింది.

కాంతం, వెంకట్రత్నం నోట్లో సున్నుండ పెట్టినట్లుండిపోయారు. ఆ మాటలు లోపల్నుండి విన్న వామనరావు ముసిముసి నవ్వులు నవ్వుకున్నాడు.

పాలమనిషి ముందూ, ఇరుగుపొరుగుల వాళ్ల దగ్గరా వామనరావుని చేతకాని చవటలా చూడ్డం అలవాటయి పోయింది ఆ తల్లీకూతుళ్లకి.

కొంత కాలంగా ఆ ఏటిఎం కార్డు లాగేసుకుని చేతిలో పైసా మిగలకుండా చేసేసారు. వాళ్లే డబ్బులు డ్రా చేసుకుని వాళ్లే బజారు చేయడం, పండుగలూ, పబ్బాలూ వస్తే అప్పులు చేయడం, వాటిని తీర్చమనడం, 'నా దగ్గర డబ్బులెలా వస్తాయి' అని వామనరావంటే 'పెళ్లాం పక్కలో పడుకోగలవుగానీ సరదాలు తీర్చలేవు' అని అత్తగారు నాలుక బయటపెట్టి ఎగతాళి చేస్తుంటే వెంకట్రత్నం కిసుక్కున నవ్వడం...రానురాను ప్రోత్సాహకంగా మారింది వామనరావుకి. ఇటీవల పెద్దోడు కూడా అతని చేయి దాటిపోవడం, నిర్లక్ష్యంగా జవాబివ్వడం జీర్ణించుకోలేకపోతున్నాడు. ఆలోచనలో పడ్డాడు.

'పొరపాటు ఎక్కడ జరిగింది? తనింత పిరికివాడు కావడానికి దారితీసిన పరిస్థితులేంటి?

ఎక్కడో చదివిన అరిస్టాటిల్ సూక్తి గుర్తుకువచ్చింది 'మంచితనం ఎక్కువైతే అది చేతకానితనంగా మారిపోతుంది' అని.

వామనరావు బుర్రలో కందిరీగలు. 'ఏదో చేయాలి' అన్న ఆలోచన తరువాతే ఈ తిరుగుబాటు.

ఆలోచనల్లో వున్న వామనరావు గౌరి కాఫీ కప్పుతో కళ్లముందు కనిపించేసరికి ఈ లోకంలోకి వచ్చి కప్పు అందుకు కాఫీ తాగి జేబులోంచి పర్సు తీసాడు.

వందనోటు తీసి "ఇదిగో అత్తా! బట్టలు సర్దుకో. గంటలో గడప దిగప్పోతే మెడ పట్టుకుని గెంటాల్సి వస్తుంది" అంటుండగా భార్య-

"అది కాదండీ... ఇప్పుడంత..."

"నోరు మూసుకుని పడుంటావా? బెల్టు దెబ్బలు రుచి చూస్తావా? ఇన్నాళ్లూ నా సహనాన్ని పరీక్షించారు. మీనుండి నా బంధువుల్లోనూ, ఆఫీసులోనూ చులకనయ్యాను. గౌరీ! దీని సూటుకేసు సర్ది రిక్షా పిలువు" అన్నాడు.


"అలాగేనయ్యగారూ! అమ్మగారూ మీరు లోనికెళ్లండి. అయ్యగారిక్కోపం తెప్పించకండి. తానానికి నీళ్లెట్టండి. బాబూ... పెదబాబూ... నాన్నగారికి గెడ్డం బాక్సియ్యి" అంది.

వెంకట్రత్నం ఇంట్లోకెళ్లిపోయింది.



## న్యాయం చేయగలదా?

కత్రినా కైఫ్-రణబీర్ కపూర్ జంటగా 'అజబ్ ప్రేమ్‌కీ గజబ్ కహానీ'లో నటించారు. ఈ సినిమా పెద్దగా విజయం సాధించకపోయినా ఈ జంట బావుందని మాత్రం అంతా మెచ్చుకున్నారు. అందుకనే మళ్లీ వీళ్లిద్దర్నీ పెట్టి ఓ సినిమాకి ప్లాన్ చేస్తున్నాడో నిర్మాత. కాకపోతే చిక్కల్లా ఇందులోని పాత్రకి కత్రినా ఎంతవరకూ న్యాయం చేయగలదూ అనేదే ప్రశ్న. ఎందుకంటే ఈ సినిమాలో కత్రినా కైఫ్ ఓ పంజాబీ యువతిగా నటిస్తోందిట. స్వతహాగా హిందీయే సరిగా పలకడం రాని ఆమె పంజాబీ భామగా రాణిస్తుందా అనే డౌటు వెలిబుచ్చుతున్నారు సినీజనాలు.




***

వామనరావు రాకను దూరం నుండి గమనించిన అటెండర్ మరియదాసు "అయ్యా అందరూ సూడండి. వామనరావొత్తండు. ఇయ్యాల మనాఫీసులో పెల్లే పెల్లి" అని అందరికీ చెప్పేసి చేతులు దులుపుకుని వామనరావుకెదురెల్లి

"ఏటి బాబూ! తమురెత్రసు గల్లంతయిపోయిందేమోననుకున్నాం" వెక్కిరింతగా అన్నాడు. తినేసినట్లు చూసిన వామనరావు చూపులకి కొంచెం వెనక్కి తగ్గినా 'ఆ...ఈడి సూపులోనెక్కా' అనుకుని "ఎల్లండెల్లండి అయ్యగోరు పంతుల్ని పిల్చి మూర్తం పెట్టారు పెల్లి సెయ్యనానికి" అన్నాడు.

ముందుకెళ్తున్న వామనరావు వెనక్కి నాలుగడుగులేసి "ఏమన్నావ్? పళ్లు రాలిపోతాయి నీ హద్దుల్లో నువ్వుండకపోతే" అని ముందుకు నడిచాడు.

గుటకలు మింగాడు మరియదాసు వామనరావును ఆశ్చర్యంగా చూసాడు. 'ఇక్కడకాదెగరటం. అయ్యగారికాడెగురు' అనుకున్నాడు.

ఆఫీసులోకి అడుగు పెట్టగానే "హల్లో... వామనరావుగారూ! బాగున్నారా?" అందరూ పలకరించారు.

"బాగున్నా" అని కుర్చీలో కూర్చుని "సారున్నారా?" అడిగాడు.

"ఉన్నారు వెళ్లిరండి"

"వస్తా"

"గుడ్ మార్నింగ్ సార్"

"వెరీ బాడ్ మార్నింగ్. ఆఫీసు గుర్తుందా? ఐ వాంట్ యువర్ ఎక్స్‌పలేషన్. నీమీద హెడ్డాఫీసుకి కంప్లైంట్ చేస్తున్నాను. నిన్ను సస్పెండ్ చేస్తాను" ఎక్కడికెళ్లావు ఇన్నాళ్లు సెలవు పెట్టకుండా, ఊరికి పోయావేం? లాంటి ప్రశ్నలేవీ లేకుండా మెరుపుల్లేకుండానే గర్జించాడు.

"సర్టెన్లీ సార్"

"అంటే? నేనేం చేయలేననే? ఏంటా తల బిరుసు?"

"తల బిరుసా సార్? ఎక్కువ మాట్లాడేస్తున్నారు. బహుశా మీకు బిపీ ఎక్కువయిందేమో అనుమానంగా ఉంది. మళ్లీ కలుస్తా"

"వాట్ నాన్సెన్స్ యువార్ టాకింగ్? నాకు బీపీ అంటావా? నిన్నేం చేస్తానో తెలుసా?" ఆవేశంగా కుర్చీలోంచి లేచాడు.

"ముందు మంచినీళ్లు తాగండి సార్. ఆ తరువాత నన్ను సస్పెండ్ చేద్దురుగానీ కారణమేంటో చెప్పి."

"నిన్ను...నిన్ను సస్పెండ్ చేయడానికి నేను కారణాలు చెప్పాలా? సెలవు చీటీ ఇవ్వకుండా వెళ్లావు. డ్యూటీకి గైర్‌హాజరయ్యావు. ఫైళ్లన్నీ నీ అరలో వుంచి తాళాలేసుకెళ్లావు. ఈ ఆరోపణ చాలదా నిన్ను సస్పెండ్ చేయడానికి?"

"కూల్‌డౌన్ సార్ కూల్‌డౌన్" అని బైటికెళ్లి "అమలగారూ! ఓసారొస్తారా? నేను మీ చేతికి లీవ్ లెటరూ, అవసరమైతే ఇవ్వమని తాళాలు ఇచ్చాను. సార్‌కివ్వలేదా?"

"ఆమె ఎవరు? ఆమె నీకాఫీసరా? నీకు సెలవు ఇవ్వనని నేను రిజెక్టు చేస్తే ఆమెకిచ్చి పంపుతావా? పీకలమీద కత్తిలా ఫైళ్లు పెడింగ్‌లూ, నా మాట కాదని నిర్లక్ష్యంగా వెళ్తావా? ఇక నిన్ను విడిచేది లేదు, పైనుండి ఆర్డర్స్ వచ్చిందాకా నువ్వాఫీసుకు రానక్కర్లేదు. టేక్ కంప్లీట్ బెడ్ రెస్ట్" అన్నారు పరశురామావతారంలో.

"సరే సార్. వన్ మినిట్. రికార్డు అసిస్టెంట్ సూర్యారావు మార్చి 15 నుండి నెలాఖరువరకూ సెలవు పెట్టి వెళ్లినప్పుడు మీరు సిఎల్ నోట్ చేయలేదు. అతనప్పుడు పెళ్లాంతో సెవెన్‌హిల్స్‌లో వున్నాడు. కానీ అతని సంతకాలు ఇక్కడ ఉన్నాయి. అక్కడ వీడియో క్లిప్పింగ్స్ కూడా నా అందుబాటులో వున్నాయి. అటెండర్ మరియదాసు రోజూ మీ పిల్లలకోసం ఇంటి దగ్గరున్నట్లు నా దగ్గర సాక్ష్యాలున్నాయి. మీరు అప్సరా హోటల్‌లో ఒకామెతో వున్నట్లు నా దగ్గర రుజువులున్నాయి. అవి మేడంగారికి అందివ్వాలనుకుంటున్నాను. తరువాత మార్చి 31న గుప్తా ఇచ్చిన రెండులక్షల నగదూ, బారువాగారిచ్చిన అమౌంట్ ఋజువులు నా దగ్గర భద్రంగా ఉన్నాయి. మీరు డ్యూటీకెళ్లకుండా మీ జీపుకు తాగించిన ఆయిలు రసీదుల వివరాలు నా దగ్గర భద్రంగా ఉన్నాయి. వస్తాను సార్. మీరు సస్పెన్షన్ ఆర్డర్స్ పంపండి. నాకూ బడలికగా ఉంది. పదిరోజులు విశ్రాంతి తీసుకుని వస్తా" అని స్ప్రింగ్ డోర్ తెరుచుకుని వెళ్లిపోతున్న వెనుకే స్ప్రింగ్ డోర్‌లా వచ్చిన ఆఫీసరు-

"మిస్టర్ వామనరావు...ప్లీజ్ కూర్చోండి" అన్నాడు అప్పుడే మూత తీసిన ఇడ్లీ కుక్కర్లోంచి పొగలు సెగలై వస్తున్నట్లు కళ్లల్లోంచి భయం పొగలు తన్నుకొస్తుంటే పక్కనే వున్న సూపరింటెండెంట్‌తో "మిస్టర్ వాసుదేవరావ్ అతన్ని కూల్ చేయండి" అన్నాడు ఆఫీసర్.

"మిస్టర్ వామన్రావు. ఏంటి... వెళ్లిన పని బాగా అయిందా? ఎక్కడికెళ్లావ్? ఎవరికి బాగోలేదసలు?" అని భుజంమీద చేతులేసి పక్క గదిలోకి తీసుకువెళ్లి "పెద్దాయన అలా అనకపోతే ఆ కుర్చీకి విలువ ఉండదు. ఆయన నెగిరినప్పుడు మనం తగ్గిపోవాలి. అయినా నువ్వేంటి గంగిరెద్దులాంటివాడివి. పొట్టేల్లా ఎగిరి పడుతున్నావు? ఏయ్ రెండు టీ చెప్పు" అటెండర్‌ని కేకేసాడు.

అటెండర్ టీలు తెచ్చాడు. వాడికి పరిస్థితి అర్థమైపోయింది. టీలు తెచ్చి మర్యాదగా అందిచ్చాడు.

"ఈమధ్య మినిస్టర్‌గారి ప్రోగ్రాం, కలెక్టర్‌గారు దంచి దించేసారు. ఆయన భయం ఆయనది. నువ్వు లేవు. ఆఫీసులో ఎక్కడి పని అక్కడ ఆగిపోయింది. పద... సారీ చెప్పి సంతకం పెట్టు రిజిస్టర్‌లో" అన్నాడు సముదాయిస్తూ.

"నో... నేను సారీ చెప్పేదిలేదు. సస్పెండ్ చేయమనండి. ఎలా మళ్లీ ఆర్డర్స్ తెచ్చుకోవాలో నాకూ తెల్సు."

"అబ్బ... నీకదేపోయిందికాదు. నాతోరా... నీకెందుకు" అని లోపలకు వెళ్లి "కూర్చో" అని కూర్చోబెట్టి "ఆయనేదో చికాకుల్లో ఉన్నాడు. సంతకం పెట్టేయమనండి" అన్నాడు.

## ప్రాణం తీసిన సరదా

కేరళాకి చెందిన 21 ఏళ్ల ప్రసూల్, సనూప్‌లు మరో ముగ్గురితో కలసి బెంగుళూరులోని కెంపపురాలో వాటర్ పైప్‌ల తయారీ కంపెనీలో పని చేస్తూ ఒకే గదిలో వుంటున్నారు. వాళ్ల వీక్లీ హాలిడే రోజున అంతా కలసి తమ గదిలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటుండగా సనూప్ కత్తితో కూరలు తరుగుతున్నాడు. ప్రసూల్ ఏదో సినిమా పాటకి వంతగా గదంతా తిరుగుతూ డాన్స్ చేయసాగాడు. పాట మధ్యలో సనూప్ దగ్గరగా వస్తూ చేతులు వూపుతూ కవ్వించసాగాడు. మూడోసారి అలా కవ్వించేసరికి కేవలం అతని ఆట కట్టిద్దామన్న ఉద్దేశ్యంతో సనూప్ తన చేతిలో కత్తి ఉండగానే ప్రసూల్‌ను గాఢంగా కౌగలించుకున్నాడు. ఆ కౌగిలి విడిపించుకుందామని ప్రసూల్ ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు సనూప్ చేతిలోని కత్తి ప్రసూల్ గొంతుని తెగకోసింది. వాళ్లంతా కంగారుపడి అతన్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే అధిక రక్తస్రావంవల్ల ప్రసూల్ చనిపోయాడని డాక్టర్లు చెప్పారు.

## 'బ్లెస్ యూ' అని ఎందుకంటారు?

మనవాళ్లల్లో ఎవరైనా తుమ్మితే పెద్దవాళ్లు 'శ్రీరామరక్ష' అంటారు. పశ్చిమ దేశాల్లో 'బ్లెస్‌యూ' అంటారు. అంటే 'దైవం రక్షించుగాక' అని అర్థం. ఎందుకంటే తుమ్మినప్పుడు నిజంగానే కొన్ని మిల్లీ సెకన్లపాటు మన గుండె ఆగిపోతుందిట.

-తటవర్తి



ఇంకా ఏదో అనబోతుండగా "నేను వద్దన్నానా? సంతకం పెట్టేసి రెస్టు తీసుకో. అమ్మాయ్ అమలా! వామనరావుకి ఈవారం నువ్వు హెల్ప్ చేయి. ఆ... మిస్టర్ వామన్‌రావు! నీకు డబ్బులేమైనా కావాలా?" అంటూ పర్సు తీస్తుండగా-

"నాట్ నెససరీ సార్" అన్నాడు వామనరావు సీరియస్‌గా.


"రేయ్ దాసు! రిజిస్టర్ పట్రా"

మరియదాసు రిజిస్టర్ పట్టుకొచ్చాడు.

"వీడ్ని కొంచెం హద్దుల్లో ఉండమనండి. గొప్ప తలబిరుసుగా ఉంటున్నాడు" అన్నాడు.


"ఏరా స్టుపిడ్! బుర్ర తిరుగుతోందా? ఈసారి నీమీద కంప్లైంట్ వస్తే యాక్షన్ తీసుకోవాల్సి వస్తుంది... జాగ్రత్త"

"ఆ...ఆ...అలాగే సార్. క్షమించండయ్యా" వామనరావు దగ్గర బాణంలా వంగుతూ నిలబడ్డాడు దాసు.



## ఈషా దశ తిరిగేనా?

సన్నీ-బాబీ డియోల్‌లతో కలిసి 'అప్నే' అనే సినిమాలో తండ్రిగా నటించాడు ధర్మేంద్ర. ఇప్పుడు తన కూతురు ఈషా కోసం ఇలాగే నటించబోతున్నాడు. ఈషా నిజజీవిత తల్లిదండ్రులు హేమమాలిని-ధర్మేంద్రలు 'టెల్ మీ ఓ ఖుదా' అనే సినిమాలోనూ పేరెంట్స్‌గా కనిపించబోతున్నారట. ఇందులో ఈషా చాలావరకు డీగ్లామరైజ్డ్‌గా నటిస్తుందిట. ప్రస్తుతం అంతంత మాత్రంగానే వున్న ఈషా సినీ కెరీర్‌కి ఈ సినిమా ఎంతవరకూ ప్లస్ అవుతుందో!



"వెళ్లు" చీదరించుకున్నాడు వామనరావు.

ఆ రోజు ఆఫీసులో భూకంపం వచ్చినట్లయింది. అందరూ భయపడి పనులు చేసుకుంటున్నారు ఆఫీసరుదగ్గర కాదు వామనరావుకి జడిసి. 'ఇంకా ఎవరెవరి గుట్లు వామనరావు జేబులో ఉన్నాయో, ఏ క్షణంలో బయటపెడతాడోనని'

ముఖాలు కూడా ఎత్తకుండా పనులు చేసుకుంటున్నారు.

అమల చుట్టూ చూసింది.

అందరూ పనుల్లో లీనమై ఉన్నారు. వామనరావు ఒళ్లు విరుచుకున్నాడు. 'య్యా' అన్నట్లు ఎడం చెయ్యి నాలుగు వేళ్లూ మడిచి బొటనవేలు ఎత్తి మెల్లగా అంది నవ్వుతూ.

కళ్లతోనే కృతజ్ఞతలు తెలియజేసాడు వామనరావు.

★★★

రెణ్ణెల్లక్రితం...

వామనరావు ఒక్కడే ఆఫీసులో కుర్చీలో కనిపించాడు. ముఖంలో దిగులు, నైరాశ్యం.

"ఏంటి సార్... ఎందుకలా డీలగా ఉన్నారు?"

వామనరావు చెప్పాడు ఇంటి పరిస్థితి. కొడుకు తగిలేస్తే కరుణించి అత్తగార్ని ఇంట్లో పెట్టుకున్నాడు. ఆవిడ రానురాను కూతుర్ని చేతుల్లో పెట్టుకుని ఇంటిమీద పెత్తనం చెలాయిస్తోంది. భార్య విలువ ఇవ్వదు. తలకు మించిన ఖర్చులు. పిల్లలు పాడవుతున్నారు. మనశ్శాంతిగా తిరిగొద్దామంటే ఆఫీసరు సెలవు ఇవ్వనంటాడు. ఇంటి నుండి సెలవు పెట్టి ఉండిపోయినవాళ్లు, సెలవు నుండి వచ్చి సంతకం చేసినవాళ్లు ఎంతో మంది...వాళ్లనేం అనడు. పైగా అందరూ చెయ్యక వదిలి వెళ్లిన పనిని రాత్రి పదైనా పూర్తి చేసినా తనకి లీవ్ ఇవ్వనంటాడు. పైగా కేకలేస్తున్నాడు. నాకైతే ఏ రైలుకిందో తల పెట్టేయాలనిపిస్తోంది.

ఎప్పుడూ చూడని కన్నీరు వామనరావు కళ్లల్లో చూసిన అమల "పదండి కేంటిన్‌కి వెళ్లి వద్దాం" అని కాఫీ ఇప్పించి అన్నీ బోధించి "వెనకటికి ఓ పాము బ్రహ్మదేవునితో 'నన్ను చూసి అందరూ పారిపోతున్నారు. నేనేం చేసేది?' అని అడిగిందిట. బ్రహ్మ 'వాళ్లని కరవకు' అన్నాడట. కొన్నాళ్ల తరువాత 'స్వామీ! నేను మీరు చెప్పినట్లే కరవకపోయినా నన్ను రాళ్లతో కొడుతున్నారే' అందట. దానికి బ్రహ్మ 'నేను కరవద్దన్నానుగానీ బుస కొట్టవద్దనలేదుగా. ఆత్మరక్షణ కోసం బుస కొట్టు' అన్నాట్ట. అక్కడ్నుంచి బుస కొట్టిన పామును చూసి జనం పారిపోవడం మొదలుపెట్టారుట. అలాగా మీరు బుస కొట్టాలి. మీరు మంచితనంతో ఊరుకుంటే అది మీ చేతగానితనంగా భావించి మిమ్మల్ని చులకన చేస్తారు. మీరెవరికీ చెప్పకుండా కొన్నాళ్లు ఎక్కడికో వెళ్లండి. మీ అత్తగారి ఆధిపత్యం తగ్గించండి. కుటుంబాన్ని, ఆర్థిక అధికారాన్ని మీ చేతుల్లోకి తీసుకోండి" అని అమల ఇంకా ఏవేవో చెప్పింది.

అన్నీ విని కళ్లు భారంగా మూసుకుని అక్కణ్ణుంచి లేచాడు. సెలవు చీటీ అమల చేతికిచ్చి ఆఫీసర్‌కిమ్మని ఇంట్లోంచి వెళ్లిపోయాడు.

★★★

ఆరడుగుల పైన పొడగరి అయినా నాలుగడుగుల పొట్టివానిగా, చులకనగా కనిపించే వామనరావుని చూస్తే ఇప్పుడు ఇంట్లోనూ, ఆఫీసులోనూ హడిలి చస్తున్నారు.

★